


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

ఆదివారం 23 ఆగష్టు 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 3




# చిన్నారుల రక్షణ.. అందరి బాధ్యత









**-బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి: జిల్లా జడ్జి పి.లక్ష్మీ శారద**

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

సమాజంలో చిన్నారులకు సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన వాతావరణాన్ని కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) చైర్‌పర్సన్ పి.లక్ష్మీ శారద స్పష్టం చేశారు. శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయం సమావేశ మందిరంలో.. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు (జిల్లా బాలల పరిరక్షణ అధికారులు) నిర్వహించిన ఒక రోజు అవగాహన సదస్సును జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహలతో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి పి.లక్ష్మీ శారద మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. ఈ దశలో పిల్లలకు కేవలం తిండి, నిద్ర, చదువు మాత్రమే సరిపోవని.. వారి మానసిక, భావోద్వేగ ఎదుగుదలకు తగిన ప్రేమ, సంరక్షణ, సమాన అవకాశాలు అందించాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కు, ఆరోగ్యం, రక్షణను ప్రతి బాలుడికి అందేలా చూడాలన్నారు. చిన్న వయసులోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని కోరారు. అదే సమయంలో మగపిల్లలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వారి సమస్యలను తెలుసుకుని తగిన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు.

**పాఠశాలల్లో నమ్మకమైన వాతావరణం ఉండాలి..**

బడిలో విద్యార్థులు తమ సమస్యలను భయం లేకుండా ఉపాధ్యాయులతో పంచుకునేలా నమ్మకమైన వాతావరణాన్ని సృష్టించాలని జడ్జి సూచించారు. సమాజంలో ఉన్న దురాచారాలు, వేధింపుల నుంచి పిల్లలను కాపాడటంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని స్పష్టం చేశారు.

**పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ.. బడులు, వసతి గృహాల్లో పిల్లల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థుల ఆలోచనా విధానం రూపుదిద్దుకునే దశ అని.. ఈ సమయంలో వారిపై సోషల్ మీడియా, ఇంటర్నెట్ ప్రభావం పడకుండా ఉపాధ్యాయులు గమనించాలని సూచించారు. తరగతి గదుల్లో హింస, వేధింపులు వంటి వాటిని గుర్తించి బాధితులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. పాఠశాల ప్రార్థనా సమయాల్లో మాట్లాడే అవకాశం ఇవ్వడం, వివిధ బాధ్యతలు అప్పగించడం ద్వారా పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించవచ్చని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, గురుకులాల ఒప్పందం ప్రకారం ఎంపిక చేసిన ఉపాధ్యాయులను చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా గుర్తిస్తూ ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

**డ్రగ్స్ కల్చర్‌కు దూరంగా ఉండాలి: ఎస్పీ కె. నరసింహ**

జిల్లా ఎస్పీ కె. నరసింహ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ద్వారా మహిళలు, చిన్నారుల రక్షణ కోసం పోలీస్ భరోసా, పోలీస్ అక్క, షీ టీమ్స్ వంటి అనేక కార్యక్రమాలు విజయవంతంగా నడుస్తున్నాయని వివరించారు. చిన్నారులు ఎలాంటి వ్యసనాలకు, డ్రగ్స్‌కు లోనుకాకుండా జాగ్రత్తపడితేనే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని హితవు పలికారు. ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ ఫార్హీన్ కౌసర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మమత, జువెనైల్ జస్టిస్ బోర్డ్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అపూర్వ రవళి, జిల్లా అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రవికుమార్, సైకియాట్రిస్ట్ డాక్టర్ ఎం. స్రవంతి, డీడబ్ల్యూఓ నరసింహారావు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గురువు వృత్తి ఎంతో విలువైనది

భానుపురి /కందగట్ల.

కందగట్ల గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తించి శనివారం ఉద్యోగ విరమణ పొందిన వాడపల్లి మురళీకృష్ణ గారికి కందగట్ల పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నరసింహ్ హాజరై దంపతులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని గురువులు భవిష్యత్తు వనరులను తీర్చి దిద్దుతారని అన్నారు. ఉపాధ్యాయునిగా మురళీకృష్ణ గారు ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని అతని వద్ద విద్యను అభ్యసించిన ఎంతోమంది ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరై, ఆయనను సత్కరించడం నాకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. మురళీకృష్ణ సార్ మా సొంత గ్రామంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సమయంలో నేను ఇంటర్మీడియట్ చదువుతున్నాను. ఆ సమయంలో సార్ అందించిన మోటివేషన్, మార్గదర్శకత్వం, ప్రోత్సాహం మరియు సహకారం నా జీవితంలో ఎంతో ప్రభావం చూపాయి. సార్ నాకు ప్రత్యక్షంగా పాఠాలు బోధించకపోయినా, ఆయనను నేను ఎప్పుడూ నా గురువుగానే భావించాను. ఉపాధ్యాయ వృత్తి అనేది అత్యంత గౌరవప్రదమైనదే కాకుండా, ఎంతో బాధ్యతతో కూడుకున్న వృత్తి. ఒక ఉపాధ్యాయుడు



తరగతి గదిలో విద్యను బోధించడమే కాకుండా, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను కూడా నిర్వర్తిస్తారు. మురళీకృష్ణ సార్ ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టి, అంచెలంచెలుగా ఎదుగుతూ, తన ప్రతిభ, అంకితభావం మరియు సేవా తత్పరతతో ప్రధానోపాధ్యాయుని స్థాయికి చేరుకుని, ఈ రోజు పదవీ విరమణ పొందడం ఎంతో అభినందనీయం. పదవీ విరమణ అనేది సేవకు ముగింపు కాదు, ఒక కొత్త అధ్యాయానికి ఆరంభం అన్నారు. ఇన్నేళ్లుగా సంపాదించిన అపారమైన జ్ఞానం, అనుభవం మరియు విజ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందిస్తూ, భావి సమాజానికి మరింతగా ఉపయోగపడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అలాగే, పదవీ విరమణ అనంతరం సార్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, ఆనందంగా, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను ."ఉపాధ్యాయుని సేవకు పదవీ విరమణ ఉండొచ్చు... కానీ ఆయన బోధించిన విలువలకు, ఆయన చూపిన మార్గానికి ఎప్పటికీ పదవీ విరమణ ఉండదు అన్నారు.

## భవిష్యత్తులో ఎలక్ట్రిక్ బైక్ లదే హవా



భానుపురి /సూర్యాపేట టౌన్

భవిష్యత్తులో ఎలక్ట్రిక్ బైకుల వినియోగం మరింత పెరగనుందని ఎంజీవన్ భూమి ఎలక్ట్రికల్ బైక్ కంపెనీ వ్యవస్థాపకులు రంగారెడ్డి మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అమ్మ గార్డెన్ ఎదురుగా ఉన్న ఎంఎన్ఆర్ బ్లాంకెట్ హాల్లో సీఅండ్ఎఫ్ సూర్యాపేట డీలర్ బూర మల్సూర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న ఇంధన ధరలు, కాలుష్య సమస్యలకు ఎలక్ట్రిక్ వాహనాలు మంచి ప్రత్యామ్నాయంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఎలక్ట్రిక్ బైకుల వినియోగంతో ఇంధన ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని అన్నారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలపై అవగాహన పెంచుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వాటిని వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి, ప్రవీణ్ రెడ్డి, జనార్ధన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

**-నంబర్ ప్లేట్లు లేని 50 ద్విచక్ర వాహనాలు స్వాధీనం**

భానుపురి /సూర్యాపేట టౌన్




వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకుని నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి సూచించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 50 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వాహనదారులు, పౌరులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వాహనాలకు నంబర్ ప్లేట్ లేకపోతే ప్రమాదాలు జరిగినప్పుడు లేదా నేరాలకు వాహనాలు ఉపయోగించిన సందర్భాల్లో వాటిని గుర్తించడం కష్ట తరమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# రాష్ట్రస్థాయి ప్రధమ అవార్డు అందుకున్న సూర్యపేట ఫోటో జర్నలిస్టు యాకయ్య

భానుపురి /సూర్యాపేట టౌన్



జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ-2026 పోటీల్లో రాష్ట్ర స్థాయి ప్రధమ బహుమతి సూర్యపేట జిల్లాకు చెందిన ఏ. యాకయ్య సాక్షి ఫోటో జర్నలిస్టు శనివారం హైదరాబాద్ లోని ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్లబ్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి,ఆల్ ఇండియా ప్రెస్ క్లబ్ అధ్యక్షులచేతుల మీదుగా ఈ అవార్డు ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు విజయకుమార్, వైస్ ప్రెసిడెంట్ రాజేష్, అరుణ ,రమేశ్, వనం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న పవిత్రోత్సవములు

భానుపురి/సూర్యాపేట కల్చరల్



జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవములలో భాగంగా రెండవ రోజు యాగశాలలో హోమ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో యజ్ఞచార్యులు హరిచరణ్ ఆచార్యులు అనిల్ కుమార్ శనివారం స్వామివారికి పట్టు పవిత్ర మాలలు అలంకరించి ఆరాధనలు కొనసాగించారు. మధ్యాహ్నం నిత్య పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులు అధిక



సంఖ్యలో పాల్గొన్నారు. అందరికీ తీర్థప్రసాదాలు అందజేసి తదియారాధన అన్న ప్రసాదం అందజేశారు. సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం యాగశాల లో హోమ కార్యక్రమాలు నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు పోతుగంటి వెంకటేశ్వర్లు, ఈవో లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న తీజ్ పండుగ

భానుపురి /సూర్యాపేట



జిల్లా కేంద్రంలోని 18వ వార్డులో తీజ్ పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి వంకుడోత్ సేవ్య విజయ ఆధ్వర్యంలో తీజ్ పండుగ ఐదో రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తీజ్ పండుగ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో తీజ్ వేడుకల్లో పాల్గొంటూ సంప్రదాయాలను కొనసాగించడం అభినంద నీయమన్నారు. ప్రతి సంవత్సరం తీజ్ పండుగను ఘనంగా నిర్వహిస్తూ గిరిజన సంస్కృతి, ఆచారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి తీజ్ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. గిరిజన సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిచ్చమ్మ, సైది, నీలమ్మ, కవిత, ధ్వలి, సుశీల, లక్ష్మి, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట కు బుల్లెట్ ట్రైన్ ఇచ్చే వరకు పోరాటమాగదు




భానుపురి/ సూర్యాపేట

వ్యవసాయ వాణిజ్య వ్యాపార పరంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిన సూర్యాపేట పట్ల పాలకులకు చిన్న చూపుఎందుకని మాజీ మున్సిపల్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా అన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్షాలు చేపట్టిన 9వ రోజు శనివారం రిలే నిరాహార దీక్షను ప్రారంభించి వారు మాట్లాడారు. సూర్యాపేట చుట్టూ పట్టణ ప్రాంతాల్లో రైలు మార్గాలు ఉన్నప్పటికీ సూర్యాపేటకు మంజూరైన బుల్లెట్ ట్రైన్ ను అలైన్మెంట్ మార్చడం పాలకుల కుట్రను భంగం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.బుల్లెట్ ట్రైన్ ఉద్యమానికి ప్రజా ప్రతినిధులు మద్దతు ఇవ్వాలని లేక పోతే ఉద్యమ ద్రోహులు గా మిగులుతారన్నారు.రోజు రోజుకు ప్రజాదరణ పెరుగుతున్న ఈ ఉద్యమానికి ప్రభుత్వం దిగి రావాల్సిందేనని ఆయన అన్నారు. ఈరోజు రాష్ట్ర ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ నాయకులు రాపర్తి శ్రీనివాస్ గౌడ్, వారణాసి రమేష్, మల్లికార్జున్, గుణగంటి సురేష్, విజయ్, మల్లేశ్,మహేష్ , పద్మక్క దుర్గారావు ,శేఖర్ ,సంపత్ ,తూడి శ్రీనివాసరావు నజీర్, నాగార్జున మరికొందరు దీక్షలో కూర్చున్నారు. వారికి పూల మాలలు వేసి ఉద్యమ అభినందనలు తెలిపిన వారిలో మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, ధర్మార్జున్ , పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి, రమణాచారి, చల్లమల్ల నరసింహ, జీడి బిక్షం, కొత్తపల్లి శివకుమార్,మట్టపల్లి సైదులు , బుర్ర వెంకటేశ్వర్లు కునుకుంట్ల సైదులు, కారింగుల వెంకన్న,తన్నీరు వాసుదేవరావు, సట్టు నాగయ్య, అఖిల్, శేషగిరి పూర్ణ శశికాంత్,భయ్యా మల్లికార్జున్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి దీక్షను కూర్చున్న వారికి పండ్ల రసాలు అందజేసి దీక్ష విరమింప జేశారు.

## సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలి

భానుపురి/సూర్యాపేట టౌన్





సి.పి.ఐ(ఎం-ఎల్ )మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో జూన్ 2వ తారీఖు నుండి ఆగస్టు 20వ తేదీ వరకు సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన పాదయాత్రలో పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటిని వెంటనే పరిష్కరించాలని శనివారం సూర్యాపేట మున్సిపాలిటీ కమిషనర్ కు సి.పి.ఐ (ఎం-ఎల్ )మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ మాస్ లైన్ సూర్యాపేట జిల్లా కమిటీ కార్యదర్శి కామ్రేడ్ కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ, పట్టణంలో ప్రజలు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటిలో కొన్ని తక్షణమే పరిష్కరించవలసినవని,కొన్ని దీర్ఘకాలిక ప్రణాళికలో చేర్చవలసి ఉన్నందున సూర్యాపేట మున్సిపాలిటీ అభివృద్ధికి 500 కోట్ల రూపాయల బడ్జెట్ను వెంటనే కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థతో ప్రజలు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన చెందారు. కాలువల్లో పూడికను తీయకపోవడం మూలాన అనేక వార్డులలో మురుగు నీరు రోడ్లపైకి చేరుకొని దుర్గంధం వెదజల్లుతుందని ఆయన అన్నారు. అలాగే ఈగలు దోమలకు ఫాగింగ్ చేయకపోవడం మూలాన ప్రజలు మలేరియా ఫైలేరియా లాంటి వ్యాధులకు గురవుతున్నారని ఆయన ఆవేదన చెందారు. అదేవిధంగా అనేక వార్డులలో మున్సిపాలిటీ నుంచి సప్లై నీరు అందకపోవడం మూలాన ప్రజలు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు చిన్న చిన్న వ్యాపారస్తులు తమ వ్యాపారానికి అనుకూలమైన అడ్డాలు లేకపోవడంతో అనేక రకాలుగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన చెందారు. వారి వ్యాపారాలకు అనుకూలంగా స్థలాల కేటాయింపులు చేయాలని డిమాండ్ చేసినారు. అదేవిధంగా సూర్యపేట పట్టణం చుట్టూ అనేక రకాల నీటి వసతులు ఉన్నప్పటికీ, వాటిని వినియోగంలోకి తేకపోవడం మూలాన ప్రజలు తాగునీరుకై, పట్టణ పరిసర గ్రామ ప్రజలు సాగునీరు కై అనేక రకాల ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆయన తెలియజేశారు. ఇందుకోసం సూర్యాపేట పట్టణ పరిసర ప్రాంతాల్లోని చెరువులన్నింటినీ వెంటనే పునరుద్ధరించి సాగునీరు తాగునీరు తదితర అవసరాలు తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు సూర్యాపేట మున్సిపాలిటీ సిబ్బందికి, ప్రభుత్వ హాస్పిటల్స్, ప్రభుత్వ కార్యాలయాలు, బస్ డిపో, బస్ స్టేషన్ల సిబ్బందితో సరియైన కమ్యూనికేషన్ లేకపోవడం మూలాన ఆయా వ్యవస్థలు అనేక రకాల డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలియజేశారు. వెంటనే మునిసిపాలిటీ, ప్రభుత్వ కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ పరిశుభ్రమైన మునిసిపాలిటీగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేసినారు. వీధిలైట్ల ఏర్పాట్లలో, సీసీ రోడ్ల నిర్మాణంలో పారదర్శకత ప్రదర్శిస్తూ పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని కోరినారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని, లేనియెడల తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ కారింగుల వెంకన్న, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కొత్తపల్లి రేణుక, పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర అఖిల్ కుమార్, పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ, నాయకులు శేషగిరి, కట్ట కల్పన, పజ్జూరి రేణుక తదితరులు పాల్గొన్నారు.

## పూల గురుస్వామికి గురు పురస్కారం ప్రదానం

కట్టంగూర్, ఆగస్టు 22:

అయ్యప్ప తత్వాన్ని స్వీకరించి విస్తృతం చేసేందుకు పాటుపడుతూ ధార్మిక సేవ చేస్తున్న గురువర్యులకు మహాశాస్త్ర సేవా సంఘం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో గురు పురస్కారాలను ప్రధానం చేశారు. కట్టంగూర్ మండల కేంద్రానికి చెందిన సాయి మణికంఠ ఆలయ గురు స్వామి వంగూరు లక్ష్మయ్య(పూల గురుస్వామి) గురుస్వామిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. పూల గురుస్వామితోపాటు సతీమణి లక్ష్మిలకు గురు పురస్కారాన్ని శబరిమలై అయ్యప్ప స్వామి వంశస్తులైన పందల వంశీయుడు సురేష్ శర్మ ముఖ్యఅతిథిగా హాజరై అవార్డును ప్రధానం చేశారు. ఈ అవార్డు కింద జ్ఞాపికను అందజేస్తూ శాలువాతో సత్కరించారు. వంగూరు లక్ష్మయ్య గురుస్వామి చిన్ననాటి నుండి ఆధ్యాత్మిక వాతావరణంలో పెరుగుతూ అయ్యప్ప స్వామి వారి దీక్షను అత్యంత భక్తిశ్రద్ధలతో స్వీకరిస్తున్న విషయం అందరికీ విదితమే. గురుపరంపరగా ఎంతోమంది అయ్యప్ప భక్తులను తీర్చిదిద్ది వారికి ధార్మిక విలువలను నేర్పించడమే కాకుండా, భక్తుల సహకారంతో కట్టంగూర్ ప్రాంతంలో అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణాన్ని పూర్తి చేయించడంతోపాటు ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు, అయ్యప్ప భక్తి ప్రచారానికి, గురుపరంపర అభివృద్ధికి వారు చేసిన విశేష కృషిని గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మహాశాస్త్ర సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రాజు గురుస్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సభలో పలువురు గురుస్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొని లక్ష్మయ్య గురుస్వామి దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హరిహరపుత్ర సేవా సమితి ప్రధాన కార్యదర్శి పెందోట సోము, కోశాధికారి పొట్టబత్తుల కృష్ణమూర్తి, ఆర్యన్ భజన్స్ పిల్లలమర్రి ఉపేందర్, వంగూరి మణికంఠ మిత్రులు పాల్గొన్నారు. పూల స్వామి గురు పురస్కారం అందుకోవడం పట్ల కట్టంగూరు సాయి మణికంఠ దేవాలయం చైర్మన్, మాజీ ఎంపీపీ జేల్లా ముత్తిలింగయ్య, కోశాధికారి గుడిపాటి శివప్రసాద్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, హరిహర పుత్ర సేవాసమితి అధ్యక్షుడు బజ్జూరి యాదయ్య తదితరులు శుభాభినందనలు తెలిపారు.

## గోరంట్లలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

భానుపురి /మద్దిరాల



మద్దిరాల మండలం గోరంట్ల గ్రామంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో జరిగాయి. గోరంట్ల గ్రామ మెగాస్టార్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో చిరంజీవి అభిమానులు, గ్రామస్తులుపెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమాన సంఘం నాయకులు భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిరంజీవి సుదీర్ఘ కాలం పాటు ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదానంలో గ్రామస్తులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి అభిమానులు పులుసు శ్రీను, తాళ్లపెల్లి సుభాష్ చంద్ర బోస్, కొలిపాక బిక్షం, జటంగి బుచ్చాలు, డాక్టర్ వెంకన్న, దేవుని మల్లయ్య, రాదారపు సది, బానోతు నాగరాజు నాయక్, బానోతు స్వరుణ్ రాజ్, బదావత్ రాజు, బానోత్ నాగులు, గుగులోత్ రమేష్‌లతో పాటు గ్రామస్తులు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలాయ అర్చకుడు సతీష్ శర్మకు అన్నపూర్ణ పురస్కారం







భానుపురి /సూర్యాపేట కల్చరల్

జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయస్వామి దేవాలయంకు దక్షిణ భారత దేశంలో ప్రముఖ దేవాలయాలకు మహాశాస్త సేవా సంఘం అందించే ప్రతిష్టాత్మకమైన అన్నపూర్ణ పురస్కారం లభించింది. ఈ సంఘం దక్షిణ భారత దేశంలో ఎంపికన 12 దేవాలయాల్లో జిల్లా కేంద్రానికి చెందిన ఈ దేవాలయం ఉండడం విశేశం. దీంతోపాటు దేవాలయ ప్రధాన అర్చకులు రేంటాల సతీష్ కుమార్ శర్మ దేవాలయం లో నిర్వహిస్తున్న విశేష పూజలతో పాటు ఆయన చేస్తున్న కార్యక్రమాలను గుర్తించినసంఘం గురుపురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు అర్చకులు మాట్లాడుతూ దేవాలయానికి అన్నపూర్ణ పురస్కారం, సతీష్ కుమార్ శర్మ గురుపురస్కారం అందుకోవడం హర్షణీయమని అన్నారు. అనంతరం పలువురు ఆయనకు శుభాకాంక్షలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో అనంతుల సూర్యనారాయణ, ఆలయ చైర్మెన్ అనంతుల గణేష్ రామలింగయ్య, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, యుగేందర్, శివ, వాసుదేవరావు, తేడ్ల ప్రభాకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.